నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | మార్చి 03, 2024 | www.navatelangana.com

గృహజ్యోతి పథకంలో జీరో బిల్లు

నవతెలంగాణ-రెబ్బెన

మండలకేంద్రంలో గృహజ్యోతి పథకంలో విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లును కాంగ్రెస్ శ్రేణులు విద్యుత్ సిబ్బందితో కలిసి వినియోగదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, మెనీఫెస్టోలో పెట్టిన విధంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో ముందుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన రోజే రెండు పథకాలు అమలుచేసిన కాంగ్రెస్ మరో రెండు పథకాలను కూడా ఫిబ్రవరి 27న వినియోగదారులకు అందించిందన్నారు. త్వరలోనే రైతులకు రుణమాఫీ, ఎన్నో సంక్షేమ పథకాలను పేదలకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లావుడ్య రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, టౌన్ అధ్యక్షుడు వనమాల మురళీ, సీనియర్ నాయకులు మోడెం చిరంజీవి గౌడ్, దుర్గం అన్నాజీ, విద్యుత్ ఏఈ ఇమ్రాన్‌ఖాన్, డీఈ, వడాయి నాగేష్, జిమ్మిబాయి పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీఎస్పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ శనివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రీ పాసైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు మార్చ్ 3 నుంచి 7 వరకు స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఉచిత శిక్షణ 11వ తేదీ నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఉంటుందని, డైలీ, వారంతపు, పూర్తి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు క్యాస్ట్, ఇన్కమ్, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో రావాలన్నారు. అభ్యర్థులకు ఆదాయ ధ్రువీకరణ పత్రం రూ.5లక్షల లోపు ఉండాలని, అభ్యర్థుల ఎంపిక విధానం రిజర్వేషన్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని, అమలులో ఉన్న నిబంధనల ప్రకారం స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 08732-221280 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

రేపు పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు

- పార్కింగ్ ప్రదేశాలు ఇవే..! డ్రోన్స్ నిషేధం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో సోమవారం ప్రధాని మోడీ పర్యటించనున్న నేపథ్యంలో పట్టణంలోని పలు రోడ్లపై ట్రాఫిక్ ఆంక్షలు ఉండబోతున్నట్లు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానమంత్రి భద్రత చర్యల్లో భాగంగా స్థానిక ఏరోడ్రం పరిసర ప్రాంతాలు సాధారణ ప్రజలకు నిషేధిత ప్రాంతాలుగా ఉన్నాయని తెలిపారు. కచ్ కంటి గ్రామ ప్రజలు ఆదిలాబాద్ పట్టణానికి రావడానికి పాత సాత్నాల రహదరి మీదుగా రావాలన్నారు. ఎరోడ్రం లోనికి అనుమతి ఉండదన్నారు. కేఆర్కె కాలనీ వాసులు పట్టణంలోకి రావడానికి మావల పోలీస్ స్టేషన్ మీదుగా తిరుమల పెట్రోల్ బంక్ వైపు ఉన్న రోడ్డు, అంకోలి, తంతోలి గ్రామ ప్రజలు పట్టణంలోకి రావడానికి కృష్ణా నగర్ మీదుగా మావల పీఎస్ ముందు ఉన్న రోడ్డు మీదుగా రావాలన్నారు. ప్రధాన మంత్రి సభకు విచ్చేస్తున్న ప్రజలకు సంబంధించిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల పార్కింగ్ ప్రదేశం వినాయక చౌక్‌లోని మధుర జిన్నింగ్, గౌతమ్ మోడల్ స్కూల్ పార్కింగ్ ప్రదేశాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభకు వచ్చే బస్సులకు సంబంధించిన పార్కింగ్ ప్రదేశం స్థానిక డైట్ కళాశాల, రామ్ లీలా మైదానం, టీటీడీసీ ఎదురుగా ఉన్న ప్రదేశం ఉపయోగించుకోవాలన్నారు. సభాస్థలికి వచ్చే ప్రజలు, కార్యకర్తలు తమ పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే వాహనాలను నిలపాలని సూచించారు. అదే విధంగా పట్టణంలో రెండు రోజులపాటు(ఆది,సోమవారం) ఎటువంటి డ్రోన్లు సభాస్థలి, హెలిపాడ్ వద్ద పట్టణంలో ఎగురవేయడం నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం ఇంటర్మీడియట్ పరీక్ష సందర్భంగా అదేవిధంగా పట్టణంలో ప్రధానమంత్రి బహిరంగ సభ, అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నందున విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వీలైనంత త్వరగా చేరుకొని పరీక్షలను విజయవంతంగా రాయాలని జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లా ప్రజలు నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ పోలీసులకు సహకరించాలని కోరారు.

అక్రమ కలప పట్టివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ రేంజ్ పరిదిలోని దంతన్‌పల్లి సెక్షన్‌లో శనివారం ఉదయం అటవీ అధికారులు అక్రమ కలప పట్టుకున్నారు. రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారం మేరకు కౌటన్ మోవాడు నుండి ఆసిఫాబాద్ వైపు వస్తున్న టాటా ఇండికా కారు(ఏపీ22వీ1202) వాహనంలో అక్రమంగా కలప తరలిస్తుండగా డిప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ కుమార్ తన బృందంతో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. కారు అనుమానాస్పదంగా కనిపించడంతో జెండాగూడా ప్రాంతంలో ఆపడానికి సిబ్బంది ప్రయత్నించారు. నిందితులు కారు వదిలి పారిపోవడంతో వారిని వెంబడించి పట్టుకొని రేంజ్ కార్యాలయానికి తరలించి కేసు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో 11 కలప దుంగలు పట్టుకున్నామని, వాటి విలువ సుమారు రూ67వేలు ఉంటుందని తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో మురళిగూడా సెక్షన్ అధికారి మహేందర్, బీటు అధికారులు రాజేష్, అనిల్, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

రోజాను హత్యచేసిన నిందితునిపై చర్యలు తీసుకోవాలి

- పోలీస్ స్టేషన్ ఎదుట కుటుంబీకుల నిరసన



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని గన్నారం గ్రామం మండువలో ఫిబ్రవరి 28న రాత్రి కమ్మరి రోజా(25) అనే మహిళను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. తమ కూతురు మృతిపట్ల తల్లి కమల ఫిర్యాదు చేయడంతో పోలీసులు హత్య కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. శనివారం మండువ నుంచి గ్రామస్తులు, బంధువులు మానవ హక్కుల కమిషన్ స్టేట్ కన్వీనర్ బండి శైలజ తరలివచ్చి ఈజ్‌గాం పోలీసు స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. అనంతరం కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. మూడు రోజులు గడుస్తున్నా నిందితుడు స్థానికంగానే ఉన్న అరెస్ట్ చేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ నాగరాజు తెలిపారు. నజ్రూల్ నగర్ విలేజి నెంబర్ 13కు చెందిన సాగర్ మండల్‌తో మృతురాలికి కొంత కాలంగా అక్రమసంబంధం కొనసాగుతుందని, సాగర్ మండల్ వేరె వివాహం చేసుకునేందుకు రోజాను దూరం చేసుకోవాలనే క్రమంలోనే హత్యకు పాల్పడినట్టు తమ విచారణలో తేలిందని, నిందితునిపై కేసు నమోదు చేసినట్టు సీఐ నాగరాజు ఆందోళన కారులకు వివరించడంతో ఆందోళన విరమించారు. చట్టప్రకారం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని సీఐ నాగరాజు చెప్పాడంతో ఆందోళన సద్దుమణిగింది.

పాము కాటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

నవతెలంగాణ-జైనూర్

మండలంలోని దుబ్బగూడ గ్రామంలో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పెందూర్ రామారావు(40) పాము కాటుతో మృతిచెందాడు. శనివారం బంధువులు తెలిపిన వివరాల ప్రకారం రోజూవారీగా శుక్రవారం దుబ్బగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని బీంజీగూడ గ్రామ సమీపంలో ఈజీఎస్ పనులు ముగించుకొని సాయంత్రం తిరిగి వస్తుండగా పాము కాటు వేసింది. చెట్ల మందులు వాడినా ఫలితం లేకపోవడంతో పరిస్థితి విషమించి మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ పాము కాటుతో మృతిచెందిన సంఘటన విషయంలో మండల ఏపీఓ నగేష్‌ను నవతెలంగాణ ప్రతినిధి వివరణ కోరాగ విచారణ చేస్తున్నట్టు తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. మృతుడు ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఈజీఎస్‌లో 2008 నుండి కొనసాగుతున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

తారు రోడ్డు నిర్మాణమెప్పుడో..?

- మార్గమధ్యలో అడ్డంకిగా ఒర్రె
- ఇబ్బందుల్లో నాగల్ గొంది ప్రజలు

గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నామని చెబుతున్నా..మారుమూల గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇస్తున్నారే తప్ప అమలుపర్చడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏ చిన్నపాటైన వాగులు, వంకలు దాటి మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి. దీంతో మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో రోడ్డు సౌకర్యం లేక స్థానికులు అనేక కష్టాలు పడుతున్నారు. గ్రామానికి తారు రోడ్డు నిర్మించాలని ప్రతి ఎన్నికల సమయంలో గ్రామస్థులు విన్నవిస్తున్నా, హామీ ఇస్తున్నారే తప్ప అమలు పర్చడం లేదు. మండలంలోని నాగల్ గొంది గ్రామానికి తారు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు పడుతున్న ఇబ్బందులపై ప్రత్యేక కథనం.



అగర్వాడ-నాగల్‌గొంది మధ్యలో ఉన్న వాగు



నాగల్‌గొందికి వెళ్లే మట్టి రోడ్డు (ఫైల్)

నవతెలంగాణ-కెరమెరి

అగార్వాడ గ్రామ పంచాయతీ పరిధిలోని నాగల్ గొంది మండల కేంద్రం నుండి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ గ్రామంలో 60 కుటుంబాలు, 456 మంది జనాభా ఉన్నారు. పూర్తిగా పోడు వ్యవసాయంపై ఆధార పడి జీవిస్తున్నారు. గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో నాయకపు గూడ, నాగల్ గొంది గ్రామాల గిరిజనులు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామానికి తారురోడ్డు లేక నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం నుండి అగర్వాడ గ్రామం వరకు 10 కిలోమీటర్లు తారు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ అగర్వాడ నుండి నాగల్ గొంది వరకు 5కిలోమీటర్ల దూరం అడవుల గుండా మట్టి రోడ్డుపై ప్రయాణం చేయాల్సిందే. మట్టి రోడ్డు సక్రమంగా లేని కారణంగా వాహనాలు సైతం అడపాదడపా తప్పితే అందుబాటులో ఉండవు.

మార్గమధ్యలో అడ్డంకిగా ఒర్రె

అగర్వాడ, నాయకపు గూడ, అగర్వాడ గ్రామాల మధ్య ఒర్రె అడ్డంకిగా మారింది. చలి వేసవి కాలాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకున్నా వర్షాకాలం మాత్రం వీరి బాధలు వర్ణాతీతం. ఎగువ ప్రాంతంలో ఏ మూలన వర్షం కురిసిన ఒర్రె నిండుగా ప్రవహిస్తుంది. దీంతో మండల కేంద్రానికి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. గతంలో నీటి ప్రవాహానికి ఓ బాలుడు మృత్యువాత పడ్డాడు. వర్షాకాలంలో 4 నెలల పాటు ఒర్రెలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. ఆటోలు ద్విచక్ర వాహనాలు సైతం గ్రామానికి వెళ్లలేని దుస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు తప్పని తిప్పలు

అగర్వాడ గ్రామానికి చెందిన కొంతమంది వ్యవసాయ భూములు నాయకపు గూడ సమీపంలో ఉండడంతో వర్షాకాలం చేన్లకు వెళ్లలేని దుస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు వాపోతున్నారు.

అంతే కాకుండా అటుగా వెళ్లే ఇతర గ్రామాల ప్రజలకు ఇబ్బందులకు తప్పడం లేదు. రోడ్డు, వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవించిన ఇప్పటి వరకు నిర్మాణం గురించి ఊసెత్తడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అగర్వాడ నుంచి నాగల్ గొంది వరకు రోడ్డు నిర్మాణంతో పాటు మార్గమధ్యలో ఉన్న ఒర్రెపై వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



నాగల్‌గొంది గ్రామం ఇదే...

వంతెన మంజూరు చేయాలి

సిడాం ధర్ము, నాగల్ గొంది



మార్గ మధ్యలోని ఒర్రెపై వంతెన మంజూరు చేస్తే రాకపోకలకు ఇబ్బందులు తగ్గుతాయి. వర్షా కాలం మండల కేంద్రానికి చేరుకోవాలంటే ఒర్రె దాటాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో ఒర్రె దాటడం గగనంగా మారింది. ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వంతెన నిర్మాణం చేపట్టాలి.

తారు రోడ్డు మంజూరు చేయాలి

దత్తు, అగర్వాడ



ఎన్నో ఏండ్లుగా గ్రామంలో నివాసిస్తున్నాం. గ్రామానికి తారు రోడ్డు లేక అవస్థలు పడుతున్నాం. వర్షం పడితే రోడ్డంతా బురదగా మారుతుంది. దీంతో మండల కేంద్రానికి చేరుకోవాలంటే అష్టకష్టాలు పడుతున్నాం. తారు రోడ్డు మంజూరు కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి ఎవరు పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం మా గ్రామానికి తారు రోడ్డు మంజూరు చేయాలి.

మున్సిపల్ బడ్జెట్ మీటింగ్‌లో రభస

- వైస్ చైర్మెన్, కమిషనర్ మధ్య వాగ్వాదం
- జనరల్ ఫండ్ విషయంలో తలెత్తిన గొడవ
- చైర్మెన్ సర్దిచెప్పడంతో సద్దుమణిగిన వైనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్మెన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన శనివారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. దాదాపు రూ.96.31 కోట్ల ఆదాయం బల్దియాకు సమకూరినట్టుగా నివేదికను ప్రవేశపెట్టారు. అందులో జనరల్ ఫండ్ కింద శానిటేషన్ కార్మికులు, ఉద్యోగుల జీతభత్యాలు, కరెంట్ బిల్లుల చెల్లింపుతో పాటు ఇతర నిర్వహణ ఖర్చులు, గతంలో చేపట్టిన పనులకు వినియోగించనున్నట్టు కమిషనర్ వివరిస్తున్న నేపథ్యంలో రభస జరిగింది. జనరల్ ఫండ్స్ నిధులను అభివృద్ధి పనులకు సైతం కేటాయించాలని మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని ప్రతిపాదించగా అది కుదరదని, కార్మికులు, ఉద్యోగుల జీత భత్యాలు, ఇతర నిర్వహణ ఖర్చులకు వాటిని వెచ్చించాల్సి ఉంటుందని కమిషనర్ ఖమర్ అహ్మద్ చెప్పారు. ఇలా అయితే ఆస్తిపన్ను ట్యాక్సులు కట్టనివ్వకుండా చూస్తామని వైస్ చైర్మెన్ అనడంతో దీంతో ఇరువురి మధ్య కొంత సేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఒకరిపై మరొకరు మాటల తూటాలు పేల్చుకోవడంతో సమావేశంలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. బీజేపీకి చెందిన కౌన్సిల్ సభ్యుడు కృష్ణ యాదవ్ సైతం ఈ విషయంలో కలుగజేసుకుని అభివృద్ధి పనులకు ఎందుకు నిధులు ఇవ్వరంటూ ప్రశ్నించడంతో సభలో మరింత దుమారం రేగింది. చివరకు తోటి కౌన్సిల్ సభ్యులు, అధికారులు, చైర్మెన్ సర్దిచెప్పి శాంతింపజేయడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం సభ యథావిధిగా సాగింది. అటు గారడి అంకెలు కాకుండా వాస్తవానికి దగ్గరగా ఉండే బడ్జెట్‌ను రూపొందించాలని కౌన్సిలర్ కలాల్ శ్రీనివాస్ కోరారు. అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆదాయాన్ని పెంచుకునేలా రీ అసెస్‌మెంట్ చేయాలని కౌన్సిలర్లు విజయ్, కృష్ణ, నజీర్ సభా దృష్టికి తీసుకొచ్చారు.

భగత్ సింగ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని భగత్ సింగ్ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంకరాఘవులు అన్నారు. శనివారం కాలనీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా లంకరాఘవులు మాట్లాడుతూ కాలనీ ఏర్పడి ఏండ్లు గడుస్తున్న ఇప్పటి వరకు భగత్ సింగ్ నగర్ కాలనీలో మౌళిక వసతులు లేవన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు అనేక సార్లు విన్నవించిన ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పించేలా చూడాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు స్వామి, జిల్లా సహాయ కార్యదర్శి ఆశన్న, పోసాని, రేణుక, ఛాయాభాయ్, ప్రభు పాల్గొన్నారు.

పార్లమెంట్ నియోజకవర్గంలో రెండో సారి మోడీ పర్యటన

- శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- సభ ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణపై అభిమానంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్ నియోజకవర్గంలో నాలుగు నెలల వ్యవధిలోనే రెండవ సారి పర్యటిస్తున్నారని బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఈనెల 4న జిల్లా పర్యటనకు రానున్న ప్రధాని సభ ఏర్పాట్లను ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎమ్మెల్యే పాయల శంకర్, ఎంపీ సోయంబాపురావ్‌తో కలిసి పరిశీలించారు. సభ స్థలి, అతిథుల గ్యాలరీ, పార్కింగ్ తదితర వాటి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ శాసనసభ పక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాలుగు నెలల వ్యవధిలో పార్లమెంట్ నియోజకవర్గంలో రెండవ సారి వస్తున్నారని తెలిపారు. వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు 4న పీఎం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ప్రధాని రాక కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. దాదాపు లక్ష మందితో సభ నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. గతంలో ఆదిలాబాద్ ఎంపీ సీటును బహుమనంగా ఇచ్చామని, ఈ సారి జరిగే ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక సీట్లు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కూడా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అండగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బోరజ్ నుంచి బేల బర్డర్ వరకు రూ.500 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. అదే విధంగా అమృత్ పథకంలో భాగంగా రూ.220 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమి పూజ ఉంటుందన్నారు. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆదిలాబాద్ వేదికగా పీఎం చేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, అధినాథ్, బ్రహ్మాండ్, మయూర్‌చంద్ర, సుభాష్, అభినవ్ సర్దార్, బోయర్ విజయ్ ఉన్నారు.

సిర్పూర్(యు) తహసీల్దార్‌కు సన్మానం



నవతెలంగాణ-జైనూర్

సిర్పూర్(యు) మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఉమేష్‌కుమార్‌ను శనివారం సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మండల ప్రజలకు మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. ఇందులో ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు అడె వెంకటేశ్, సిర్పూర్(యు) బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధర్మారావు, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ఆత్రం భగవంత్‌రావు, మాజీ సర్పంచ్ వీనాబాయి, నాగోరావు పాల్గొన్నారు.

మాలీల ఎస్టీ హోదా బిల్లును పాస్ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మాలీలకు సామాజిక న్యాయం కోసం 23 సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేసి "మాలీల ఎస్టీ హోదా బిల్లు"ను అసెంబ్లీలో పాస్ చేయించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. ఈ విషయమై శనివారం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి 4న జిల్లాకు రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. ఇందులో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు ఉమేష్ రావు ధోలే ఉన్నారు.

ఒక ఉద్యోగం చేస్తూ.. మూడు ఉద్యోగాలు సాధించాడు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న గూగుల్ ప్రవీణ్ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. శనివారం కళాశాలలో ప్రవీణ్‌కు సన్మాన కార్యక్రమం చేసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రవీణ్ కష్టపడే తత్వాన్ని మెచ్చుకున్నారు. ప్రవీణ్ టీజీటీ, పీజీటీ, గురుకుల జూనియర్ లెక్చరర్ పోస్టులు సాధించారన్నారు. అయితే తాను గురుకుల జూనియర్ లెక్చరర్‌గా జాయిన్ అవుతానని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కళాశాల అధ్యాపకుల సలహాలు సూచనలు తన విజయంలో ముఖ్యపాత్ర వహించాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగం సాధించిన లెక్చరర్‌కు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యపకురాలిగా పనిచేస్తున్న సవిత రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా శనివారం ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సవితకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ అనిత, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత రావ్, ఎస్.కె మూజీబ్ శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుత కళాశాలలో ఆమె అందించిన నిబద్ధత, అంకితమైన సేవలను వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.సంతోష్ కుమార్, సూపరింటెండెంట్ కరుణాకర్, ఎ.సంతోషిణి, సిబ్బంది ఉన్నారు.

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

యువతకు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సామాజిక కార్యకర్త జాదవ్ రవి అన్నారు. శనివారం మండలంలోని లక్కారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న నవోదయనగర్, రాంజీగోండు నగర్, యూత్ సభ్యులకు క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సిపతి లింగాగౌడ్, కాల్వ రవి, సంపంగి రెడ్డి ఉన్నారు.

పాలిటెక్నిక్ విద్యాపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ఆశ్రమోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శనివారం పాలిటెక్నిక్ విద్యాపై పాలీసెట్ ఇన్‌చార్జ్ మురళి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పదో తరగతి పాస్ అయితే వెంటనే పాలీసెట్ రాసి పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని సూచించారు. పాలిటెక్నిక్ డిప్లమా వల్ల నేరుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. డిప్లమాలో 24 రకాల ఇంజనీరింగ్ కోర్సులకు ప్రవేశం ఉంటుందని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో గజానంద్, లింగేశ్వర ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా రైతు జాగ్రత్తలు పాటించాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల రైతులు పంట పొలాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్సై నరేష్ అన్నారు. శనివారం మండలంలోని జాతర్ల గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంధ్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట రక్షణ కోసం ఎలక్ట్రికల్ వైర్ పెట్టడం వలన ప్రజలు మరణించే అవకాశం ఉందని, పంటచేన్లలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లను ఉంచుకూడదని పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత దగ్గరై సేవలు అందిస్తున్నామని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే డయల్ 100 కాల్ చేయాలని, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, లైంగికంగా వేధించటం, వెనకబడటం ఇటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లైంగికంగా వేధిస్తే ఎవరైనా భయపడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. కొత్త వారిని గుడ్డిగా నమ్మవద్దని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక దురాచారాల నిర్మూలన, గ్రామీణ వాతావరణ విశిష్టత, కుటుంబ అనుబంధాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మహిళల గురించి ప్రత్యేక రక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. మహిళల రక్షణ, భద్రత సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ గురించి, షీ టీమ్స్ పనిచేస్తున్నాయని తెలిపారు. స్త్రీలను గౌరవించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అప్పుడే పుట్టిన పిల్లల నుండి ఐదేండ్లలోపు చిన్నారులకు పోలియో టీకాలు తప్పని సరిగా వేయించి వికలాంగత్వం రాకుండా నిరోధించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. పోలియోకు నివారణ ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఈ నెల 3న పల్స్ పోలియో కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 730 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అర్బన్ ఏరియాలో 83, రూరల్ ఏరియాలో 155, ట్రైబల్ ఏరియాలో 492 సెంటర్లలో ఈ టీకాలు వేయనున్నట్టు తెలిపారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 78 వేల మంది చిన్నారులను ఇదివరకే గుర్తించామన్నారు. ఒక్కో బూత్ పరిధిలో నలుగురు సిబ్బందిని కేటాయించామని, వారు చిన్నారులకు టీకాలు వేస్తారన్నారు. అలాగే మిస్ అయినవారికి 4, 5వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వైద్య ఆరోగ్య సిబ్బంది ఈ టీకాలు వేస్తారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలకు తప్పకుండా ఈ టీకాలను వేయించాలని సూచించారు. వికలాంగత్వం రాకుండా ముందస్తు నివారణ కోసమే ఈ పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించాలని, చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపాలని పేర్కొన్నారు.

సంరక్షణ కోసం అవగాహన పాదయాత్ర



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అడవులతో పాటు వన్యప్రాణాలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టీఎన్జీఓ అధ్యక్షుడు అశోక్ అన్నారు. శనివారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకోని వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపెల్లి కృష్ణ చేపట్టిన అవగాహన పాదయాత్రను శనివారం విద్యనగర్ కౌన్సిలర్ కలల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. స్థానిక గజిటెడ్ నంబర్-1 పాఠశాలలో విద్యార్థులకు తొలుత అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన కరపత్రాలను అథితులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎన్జీఓ అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యంగా ఉంటేనే మానవ మనుగడ ఉంటుందన్నారు. అడవులు, వన్యప్రాణులతో ప్రజలకు ఎంతో లాభం ఉందన్నారు. వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ కృష్ణ పట్టణంలో పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం అడవుల్లో వన్యప్రాణుల సంఖ్య రోజు రోజు తగ్గి పోతుందని, ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో వన్యప్రాణులు కనుమరుగు అయ్యే అవకాశం లేక పోలేదని, అడవులు, వన్యప్రాణుల ఆవశ్యకత గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. అడవులను అడవి జంతువులను అందరు కలిసి కాపాడుకోవాలన్నారు. అంతరించి పోతున్న అడవులు, వన్య ప్రాణుల గురించి ప్రజలకు తెలియజేయడంతో పాటు వారిని చైతన్య పరచడానికి పట్టణంలో పాదయాత్ర చేపట్టినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరు అడవులతో పాటు వన్యప్రాణులకు కాపాడాలని కోరారు.

రేపు పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకోండి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈనెల 4న జిల్లా కేంద్రంలో జరగబోయే బహిరంగ సభకు హాజరవుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ నిబంధన దృష్ట్యా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులు పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయం కంటే ముందుగానే చేరుకోవాలని డీఐఈఓ రవీందర్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం పరీక్షలు రాసే విద్యార్థులు గ్రామాల నుండి జిల్లా కేంద్రం నుండి పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గంటల కంటే ముందుగానే రావాలని సూచించారు.

మోడీ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-తాంసి

ఈనెల 4న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడ మైదానంలో ప్రధాని నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ మండల నాయకులతో పాటు మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభకు తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ప్రవీణ్‌రెడ్డి, నాయకులు స్వామి, పోచమ్మ సంతోష్, రాములు ఉన్నారు.

సెకండ్ ఇయర్ పరీక్షకు 486 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం నిర్వహించిన సెకండ్ ఇయర్ ఇంగ్లీష్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 9635 విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 9149 మంది విద్యార్థులు హాజరూ కాగా 486 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ కుమార్ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎంఐఎం ముందుకు సాగుతోందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ అన్నారు. శనివారం పార్టీ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని మసూద్ చౌక్‌లోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించిన శ్రేణులు ఆ తరువాత కెక్‌కట్ చేసి ఒకరినొకరు తినిపించుకుంటు ఆవిర్భావ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ మాట్లాడుతూ 1958 మార్చి 2న ఆవిర్భావమైన ఏఐఎంఐఎం నాటి నుంచి నేటి వరకు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటు ప్రజా సమస్యలపై ఉద్యమిస్తోందని అన్నారు. అన్ని వర్గాల కోసం పాటుపడుతూ పార్టీ నేడు జాతీయ స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. 66 ఏళ్ల చరిత్ర కలిగిన పార్టీకి హైదరాబాద్ ఎంపీ అసదొద్దిన్ ఒవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీలు పునాది వేసి పటిష్టపరుస్తున్నారన్నారు. పార్టీ అన్నివర్గాల కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహ్మద్ రోహిత్, ఇనాయత్, అస్లాం పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన ఎపీఓ భీంరావు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కుంటగూడ గ్రామంలో శనివారం ఏపీఓ భీంరావ్ నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రోజు నర్సరీల్లోని మొక్కలను పరిశీలిస్తూ, బాధ్యతగా పెంచాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగారాం పాల్గొన్నారు.

కాన్వెంట్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ స్కూల్లో ఫుడ్ ఫెస్టివల్‌ను శనివారం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసి తీసుకువచ్చిన వంటకాలు, ఇతర వస్తువుల ప్రదర్శనతో పాటు అమ్మకాలు చేపట్ట పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు వాటిని కొనుగోళుచేసి రుచులను చూశారు. ఇలాంటి ఫెస్టివల్ కారణంగా విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కలుగుతుందని పాఠశాల యాజమన్యం తెలిపింది. విద్యార్థులు కూడా ఉత్సహంగా ఈ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు.

టీజీటీ ఉద్యోగానికి ఎంపిక

కుభీర్ : మండలంలోని డోడర్నా 1తాండకు చెందిన చౌహన్ వామన్ పరుబాయ్ దంపతుల కుమారుడు సునీల్ ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గురుకుల ఫలితాల్లో టీజీటీ ఉద్యోగానికి మండల యువకుడు ఎంపికయ్యాడు. దీంతో సునీల్ పదో తరగతి వరకు డోడార్నా ఆశ్రమ పాఠశాలలో, ఇంటర్ కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కుబీర్‌లో, డిగ్రీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉట్నూర్‌లో, పీజీ సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో, ప్రస్తుతం హిందీలో పీహెచ్‌డీ తెలంగాణ విశ్వవిద్యాలయంలో చదువుతున్నాడు. శనివారం కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సునీల్‌ను అభినందించారు.

ఎంపీపీ భర్తపై చర్యలు తీసుకోవాలి

లక్ష్మణచాంద : ఎంపీపీ అడ్వాల పద్మ భర్త అడ్వాల రమేష్ శుక్రవారం ఎంపీపీ కార్యాలయంలో బీజేపీ పార్టీ సమావేశం నిర్వహించడం సబాబు కాదని కాంగ్రెస్ మండల అధ్యక్షులు వొద్నాల రాజేశ్వర్ అన్నారు. శనివారం జెడ్పీ సీఈఓ, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వేర్వేరుగా వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపీపీ భర్త అడ్వాల రమేష్ బీజేపీ కండువాలు వేసుకొని ఎంపీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించడం సమంజసం కాదని ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈటెల శ్రీనివాస్, నరేష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మెరిసిన విద్యాకుసుమం

- మొదటి ప్రయత్నంలోనే టీజీటీ ఉద్యోగం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మొదటి ప్రయత్నంలోనే టీజీటీ ఉద్యోగాన్ని సాధించి హౌరా అనిపించుకుంది. తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేసింది. ఆదిలాబాద్‌లోని శాంతినగర్ కాలనికి చెందిన సూరం రాధా భగవాండ్లు దంపతుల కుమార్తె సూరం స్వాతి. తండ్రి వృత్తి రిత్యా ఉపాధ్యాయుడు కావడంతో తన కుమార్తెకు చదువుపై ఉన్న ఆసక్తిని గుర్తించాడు. చిన్ననాటి నుంచి ప్రణాళికా బద్దంగా చదివించాడు. చదువుపై మక్కువ ఉన్న ఆమె చదువులో రాణించింది. తల్లిదండ్రుల ప్రోత్సహంతో పైచదువులు చదివింది. ఎలాంటి శిక్షణ లేకుండా ఇంటి వద్దనే చదువుకొని తను సాధించాలనుకున్న ఉద్యోగాన్ని సాధించింది. తమ కుమార్తె టీజీటీ ఉద్యోగం సాధించడంతో ఆనందం వ్యక్తం చేశారు. స్వాతి ఉద్యోగం సాధించడం పట్ల కాలనీవాసులు, బంధువులు అభినందనలు తెలియజేశారు. నేటి యువత స్వాతిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలను సాధించాలని కోరారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



నవతెలంగాణ-బోథ్

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని కాంగ్రెస్ ఎంపీ ఆశావాహ అభ్యర్థి ఆత్రం భాస్కర్ అన్నారు. బోథ్ మండలంలోని వజ్జర్, కేశవ్ గూడ, గ్రామంలోని క్రీడ గోండ్వానా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను శనివారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వజ్జర్, మహాదుగూడ, జైతుగూడ, గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులకు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామాల్లోని తాగునీరు, రోడ్డు, విద్యారంగ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కోవ లక్ష్మణ్ పటేల్, ఆత్రం జైతు, ఆత్రం పురుషోత్తం, మెస్రం మాన్కు, సిడాం భుజంగరావు సిడాం పురుషోత్తం, యూత్ సభ్యులు, ఆత్రం భాస్కర్ అన్న యువ సైన్యం సభ్యులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని పాట్నాపూర్ గ్రామంలోని శనివారం మాజీ సర్పంచ్ పంద్రం సుగుణ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ నిధులతో రూ.4.95 లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అలాగే ఎంపీ తన నిధులు కేటాయించి కమ్యూనిటీ భవనం నిర్మించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కైలాస్ పటేల్, గ్రామస్తులు పంద్రం శంకర్, భీంరావ్ పూజారి, సిడం నారాయణ, మాజీ సర్పంచ్ అర్క రవీందర్, తొడసం గోపాల్, పెందూర్ సోనేరావు, ఆత్రం మోహన్, అర్క లచ్చు, దశరథ్, దేవరావు, లాలురామ్ పాల్గొన్నారు.

టీజీటీ గురుకుల ఉద్యోగాల్లో అర్హత

నవతెలంగాణ-తాంసి

టీజీటీ గురుకుల ఫలితాల్లో భీంపూర్ మండలానికి చెందిన ఇద్దరు ఉద్యోగాలు సాధించారు. వడూర్ గ్రామానికి చెందిన మంగదుడ్ల ప్రియాంక ఇదివరకే సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై, ప్రస్తుతం శిక్షణలో తీసుకుంటుంది. మొన్న విడుదలైన టీజీటీ గురుకుల పలితాల్లో సోషల్‌లో ఎంపికైంది. నిపాని గ్రామానికి చెందిన నడికట్ల అవినాష్ సైతం టీజీటీ జేఎల్ రెండు ఉద్యోగాలు సాధించారు. ఇరువురిని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

ఉద్యమకారుల పుస్తక రచనకు సమాచార సేకరణ

నవతెలంగాణ-ముథోల్

ఉద్యమకారుల పుస్తక రచనకు సమాచార సేకరణను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిర్మల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్ సేకరించారు. శనివారం మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారులను కలిసి పుస్తక రచనకు కావాల్సిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ముథోల్ మండల టీజేఏసీ కన్వీనర్లు రోళ్ల రమేష్, ఏనుగు రాంరెడ్డి, దశరథ్ ఉన్నారు. ఈ సందర్భంగా మలివిడత తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ నాయకులు వివరాలు ఉద్యమ చరిత్ర పుస్తక ప్రచురణకు సేకరించారు. మండల బాధ్యులు పీసర శ్రీనివాస్‌గౌడ్ వివరాలు నమోదు చేశారు. మండలంలోని తెలంగాణ ఉద్యమకారులతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు.

బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రంలో శనివారం జరిగిన వార్షిక పరీక్ష అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రవేశాల కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ ఇంటర్ విద్య అనంతరం డిగ్రీ కళాశాల నిర్మల్‌లో నాణ్యమైన విద్యను అందించే, అత్యుత్తమ బోధన నైపుణ్యాలు కల్గిన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. అధ్యాపకుల అనుభవంతో విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందాలని విద్యార్థులకు కళాశాల సహయ ఆచార్యులు డాక్టర్ పీజీ రెడ్డి, కే.శ్రీహరి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధునాతనమైన కంప్యూటర్ లాబ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ లాబ్, డిజిటల్ తరగతి గదులు, డిగ్రీ అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి కావాల్సిన కోచింగ్, ప్రయివేట్ కంపెనీలలో జాబ్స్ కొరకు ట్రైనింగ్ ఇచ్చే టీఎస్‌కేసీ కేంద్రం తమ కళాశాలలో ఉన్నాయని విద్యార్థులకు వివరించారు.

కబడ్డీ, క్రికెట్ పోటీల ముగింపు

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా కబడ్డీ, క్రికెట్ పోటీలను నిర్వహించారు. కాగా శనివారం చివరి రోజు జాతర ముగియడంతో క్రికెట్ పోటీల్లో మహారాష్ట్ర ఆజాద్ టీం విజేతగా నిలిచింది. వీరికి మొదటి బహుమతి రూ.40వేల నగదును పిడుగు సంజీవరెడ్డి అందజేయగా, రెండో బహుమతి మండల కేంద్రం క్రీడాకారులకు రన్నరప్‌గా నిలిచి రెండో బహుమతి రూ.30వేలు గ్రామస్తులు అందజేశారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతిగా మహారాష్ట్ర రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు ఉమ్రి మూడో బహుమతి రూ.10వేలు మందగూడ క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పిడుగు సంజీవరెడ్డి, ఎంపీటీసీ చంటి, మాజీ ఉపసర్పంచ్ సత్యపాల్, మండల బీసీ నాయకుడు మేకల రవికాంత్, గ్రామస్తులు అభిరామిరెడ్డి, వసిం, పద్మకర్‌రెడ్డి, సంతోష్, నవీన్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, ఆసం రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి సదుల్లా దరఖాస్తు

ఇచ్చోడ : కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి కోసం ఆ పార్టీ సీనియర్ నాయకులు మండలానికి చెందిన షేక్ సదుల్లా దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్‌ను కలిసి దరఖాస్తును అందించినట్లు తెలిపారు. 2009లో కాంగ్రెస్ పార్టీలో చేరి, ఇప్పటి వరకు వివిధ పదవులు చేపట్టినట్టు తెలిపారు. జిల్లా అధ్యక్ష పదవి వస్తే జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | మార్చి 03, 2024 | www.navatelangana.com

విద్యుద్ఘాతంతో బాలుడు మృతి

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని కిర్డీ గ్రామానికి చెందిన చౌదరి సరిత, పోచయ్య దంపతుల కుమారుడు రిషీకుమార్(4) శనివారం విద్యుద్ఘాతంతో మృతిచెందాడు. ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం బాలుడి తల్లి సరిత తమ ఇంటిలో బోరుబావి వేసుకొని బట్టలు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు రిషీకుమార్‌కు షాక్ తగిలి అరవడంతో తండ్రి పోచయ్య కరెంటు బంద్ చేసి కుటుంబసభ్యుల సాయంతో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సాగర్ తెలిపారు.

జిల్లా కలెక్టర్‌గా వెంకటేష్ దౌత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా నూతన కలెక్టర్‌గా జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ దౌత్రేను నియమిస్తూ రాష్ట్ర ముఖ్య కార్యనిర్వహణాధికారిని శాంతి కుమారి ఉత్తర్వులు విడుదల చేశారు. రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్‌ను జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న స్నేహ శబరీష్‌ను జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఆమె జిల్లాకు రావడానికి అంగీకరించని నేపథ్యంలో ఆమె స్థానంలో తిరిగి అదే జీహెచ్ఎంసీలో అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ దౌత్రేను నియమిస్తూ ఉత్తరుల్లో సవరణ చేసి విడుదల చేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్
- కార్మికుల నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల నూతన కమిటీ ఎన్నికకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ వేతనాలతో పాటు జీఓ నెంబర్ 60 ప్రకారంగా కేటగిరి వైజ్‌గా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీ కావడంతో వెంటనే పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తూ వారానికి ఒక్కరోజు సెలవు ఇవ్వాలన్నారు.

కార్మిక సంఘం అధ్యక్షుడిగా రాజు

మున్సిపల్ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. 34 మందితో నూతన కమిటీ ఎన్నిక కాగా అధ్యక్షుడిగా మాట్ల రాజు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడుగా పెరిక శ్రీకాంత్, కార్యదర్శిగా తోట సమ్మయ్య, కోశాధికారిగా బాపురావు, సహ కార్యదర్శులుగా ప్రభాకర్, ఇస్తారి, శంకర్, లక్ష్మి, మోతే లక్ష్మి, ఉపాధ్యక్షులుగా మోతిరామ్, శంకర్, శ్రీనివాస్, రాజు, సాగర్‌లతో పాటు 21 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

శ్రీపాదరావు సేవలు ఎంతో గొప్పవి

- అదనపు కలెక్టర్ దాసరి వేణు
- ఘనంగా జయంతి వేడుకలు



శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యేలు, అదనపు కలెక్టర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలతో మమేకమై అభివృద్ధి దిశగా వినూత్న సంస్కరణలతో సేవలు అందించిన దుద్దిళ్ళ శ్రీపాదరావు సేవలు ఎంతో విలువైనవని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు అన్నారు. శనివారం జయంతి ఉత్సవాలలో ఆసిఫాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి పురుషోత్తంలతో కలిసి హాజరై దుద్దిళ్ళ శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామంలో జన్మించిన శ్రీపాదరావు రాజకీయ ప్రస్థానంలో ప్రజలతో మమేకమై అనేక సంస్కరణల ద్వారా అభివృద్ధికి కృషి చేశారన్నారు. మూడు పర్యాయాలు మంథని నియోజకవర్గ శాసనసభ్యుడిగా, శాసన సభాధిపతిగా అనేక పదవులలో ప్రజా సేవకు విశేష కృషి చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. మహనీయులు ఆచరించి చూపిన మార్గాలను ఆదర్శంగా తీసుకొని దేశ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ మాట్లాడుతూ శ్రీపాదరావు జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మంథని నియోజకవర్గ శాసన సభ్యులుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ విశిష్ట సేవలు అందించి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని అన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధి నుండి శాసనసభ్యులుగా, శాసనసభ అధిపతిగా వివిధ పదవులను అలంకరించి ప్రజా శ్రేయస్సుకు కృషి చేశారని, మాజీ ప్రధాని పీవీ. నరసింహారావు అనుచరుడిగా, గోదావరి నది పరివాహక ప్రాంతంపై అనుభవం కలిగి ఉండి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని, శ్రీపాదరావు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



నవతెలంగాణ-కౌటాల

తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖ ఆధ్వర్యంలో శనివారం ఖాతా నిర్వహణ అధికారి నరసింహస్వామి బీమా చెక్కు అందజేశారు. ఇటీవల మండలంలోని కన్నెపెల్లి గ్రామానికి చెందిన నికోడె లక్ష్మీ చనిపోవడంతో ఆమె భర్త శ్యాంరావుకు ఎస్‌బీఐ లైఫ్ సంస్థ ద్వారా వచ్చిన రూ.రెండు లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం క్రింద ఖాతాదారులు సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే అనారోగ్య కారణాల వల్ల చనిపోతే రూ.రెండు లక్షల బీమా వర్తిస్తుందన్నారు. అర్హులైన ఖాతాదారులు బీమా చేసుకోవాలన్నారు. ఇన్సూరెన్స్ పొదుపు పథకాల గురించి వివరించారు.

పొదుపుపై విద్యార్థులకు అవగాహన

మండల కేంద్రంలోని భారతీయ విద్యామందిర్ పాఠశాలలో విద్యార్థులకు చిన్నప్పటి నుండే పొదుపు అలవాట్లు నేర్చుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. ఆర్థిక క్రమశిక్షణను కలిగి ఉండాలన్నారు. మొబైల్ ఫోన్‌లను ఎక్కడిపడితే అక్కడ చార్జింగ్ పెట్టుకోవద్దని, దానిద్వారా జరిగే సైబర్ మోసాలకు లోనుకావొద్దని పిల్లలకు సూచించారు. పిల్లలు ఇప్పటి నుండే పొదుపు చేసుకొని చిన్నచిన్న మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలో నిల్వ చేసుకుంటే భవిష్యత్తులో విద్యార్థులకు అవసరమైన సమయంలో విద్యా రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి చదువులో మంచి ప్రతిభ కనబరిచి సమాజానికి, ఊరికి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో శాఖా క్షేత్రాధికారి మనోహర్, అకౌంటెంట్ రాజేష్, క్యాషియర్లు భాస్కర్, గోపి, బ్యాంకు మిత్ర నీరజ, భారతీయ విద్యా మందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడీ సభను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈనెల 4న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే దేశ ప్రధాని నరేంద్ర మోడీ సభను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటిసారిగా దేశ ప్రధాని ఆదిలాబాద్ జిల్లాకు రానున్నారని, ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన పనులను పరిశీలిస్తారన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో జిల్లా నుండి సమర శంఖం పూరిస్తారని తెలిపారు. నరేంద్ర మోడీ దేశానికే కాదు ప్రపంచంలో పెద్దన్న పాత్ర పోషిస్తున్నారన్నారు. దేశ అభివృద్ధిలో రాష్ట్ర అభివృద్ధిలో వివిధ పథకాల ద్వారా ఎన్నో నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరిస్తున్నారని తెలిపారు. అటువంటి సీఎం సభకు పెద్ద ఎత్తున జిల్లా నుండి ప్రజలు శ్రేణులు కదిలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెర్ల మురళీధర్, మాజీ దళితమోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి సప్త శ్రీనివాస్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి సూర్యప్రకాష్, మండల అధ్యక్షులు శ్రీధర్, శ్రీనివాస్, శ్రవణ్ గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సుచిత్, రత్నం రవీందర్ పాల్గొన్నారు.

బెజ్జూరు : ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ఈ నెల 4న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ కోరారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ 43 సంవత్సరాల తర్వాత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు వస్తున్నందున మండలం నుండి అధిక సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని, అందుకు కార్యకర్తలు సహకరించాలని కోరారు. ప్రజలను తరలించేందుకు మండలానికి బస్సులు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మాజీ మండల అధ్యక్షుడు కోండ్ర మనోహర్‌గౌడ్, కొప్పుల శంకర్, కుమ్మరి తిరుపతి, భిక్షపతి, జాడి దిగంబర్, మెస్రం రాజారాం, వసీఉల్లా ఖాన్, కోర్తె తిరుపతి, కోల కిష్టయ్య, ఎలాది నారాయణ, నెల్లి మహేష్, ఏలేశ్వరం రమేష్, సామల తిరుపతి పాల్గొన్నారు.

నేడు పల్స్‌పోలియో

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఆరోగ్య శాఖ ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, తమ పిల్లలకు మండలంలో కేటాయించిన పోలియో బూత్ కేంద్రాలకు విధిగా వచ్చి పోలియో చుక్కలు వేయించుకోవాలని లోనవెల్లి ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు డాక్టర్ నవత అన్నారు. మండలంలో 23 పోలియో కేంద్రాలతో పాటు మరో రెండు మొబైల్ వాహనం ఉంటుందని, 0 నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజంగా ఉండాలనే ఉద్ధేశ్యంతో ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి ఒక్కరు తమకు అందుబాటులో ఉన్న పోలియో కేంద్రానికి వెళ్లి పోలియో చుక్కలు వేయించాలని, మరిన్ని వివరాల కోసం ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలను సంప్రదించాలన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-దహెగాం

ప్రధాన మంత్రి విశ్వ కర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఓబీసీ సామజిక సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ సామజిక వర్గాని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రతీ బీసీ బిడ్డను ముందుకు తీసుకురావాలని ఉద్దేశంతో ప్రధాని మోడీ శ్రీకారం చుట్టారన్నారు. ఈ పథకనికి సంబందించిన సందేహాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోలేం వెంకన్న, పుల్గం నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రా తిరుపతి గౌడ్, ప్రభాకర్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పడాల సురేష్, సామెరా మల్లేష్, ఓబీసీ జిల్లా మీడియా కన్వీనర్ తుమ్మిడి సురేష్, చప్పిడి సంజీవ్, దెబ్బటి సత్యనారాయణ, పుప్పాల లక్ష్మీనారాయణ, మండల బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచాలి

- అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రతి పాఠశాలలో గ్రంథాలయ పీరియడ్ తప్పనిసరిగా నిర్వహించి విద్యార్థులకు పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంచాలని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ అన్నారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాలోని పాఠశాలలకు అందిస్తున్న పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటన్నింటినీ పాఠశాలల ఉపాధ్యాయులు ఉపయోగించుకొని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు అయ్యేలా లైబ్రరీ పీరియడ్ కొనసాగించాలన్నారు. పుస్తక పఠనం అలవాటుగా మారితేనే నేడు సమాజంలో జరుగుతున్న సమకాలీన అంశాల పట్ల అవగాహన వస్తుందని, చదువు పట్ల ఆసక్తి కలుగుతుందని, విజ్ఞానవంతులుగా తయారవుతారని తెలిపారు. జిల్లాలోని 150 ప్రాథమిక పాఠశాలలు, 96 ప్రాథమికోన్నత, 20 ఉన్నత, ఒక్కొక్క ప్రాథమిక పాఠశాలకు 261 పుస్తకాలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు 335 పుస్తకాలు, ఉన్నత పాఠశాలలకు 381 పుస్తకాలు అందజేయడం జరిగిందన్నారు.

పోలీస్, ప్రెస్ క్రికెట్ మ్యాచ్.. పోలీసుల గెలుపు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మూడు రోజులుగా జరుగుతున్న క్రీడ పోటీల్లో భాగంగా శనివారం పోలీసులు, ప్రెస్ సభ్యులకు మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఎస్పీ 11 టీం వర్సెస్ ప్రెస్ టీంకు మధ్య నిర్వహించిన పోటీలో ముందుగా జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ సభ్యులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మ్యాచ్ ప్రారంభం కాగా మొదట బ్యాటింగ్ చేసిన ఎస్పీ 11 టీం 10 ఓవర్లలో 107 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ప్రెస్ టీం నిర్ణీత 10 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 50 పరుగులు చేసింది. ఉదయం నుండి ప్రారంభమైన మ్యాచ్‌లో ప్రతి ఒక్కరు ఉత్సాహభరితంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు ప్రజలతో పోలీసుల సంబంధాలు పెంచడానికి తోడ్పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులతో పాటు జిల్లా కేంద్రంలోని వివిధ పత్రికల ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకుల టీజీటీలో కేబీఎస్సీ విద్యార్థుల సత్తా





నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర గురుకుల బోర్డు గతంలో నిర్వహించిన టీజీటీ పరీక్షల్లో జిల్లా కేంద్రంలోని కుమురం భీం స్టడీ సర్కిల్ విద్యార్థులు సత్తా చాటారు. స్టడీ సర్కిల్‌లో కోచింగ్ తీసుకున్న ముగ్గురు విద్యార్థులకు ఉద్యోగం వచ్చినట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్లు ఉషన్న, రాజశేఖర్ తెలిపారు. తమ స్టడీ సర్కిల్ నుండి ఇప్పటికే ఐదు మంది పోలీస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ప్రస్తుతం ముగ్గురు టీజీటీలుగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన విద్యార్థుల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నట్లు వివరించారు.

జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌ను కలిసిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కలెక్టర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లి జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హేమంత్ బోర్కడేని శనివారం హైదరాబాద్‌లో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు కశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అంధించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలోని పలు అంశాల వారి మధ్య చర్చకు వచ్చాయి.


మహా శివరాత్రి గోడప్రతుల ఆవిష్కరణ



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని తాటిపెల్లి గ్రామంలోని పుర్క వద్ద హనుమాన్ మందిర్‌లో నిర్వహించే మహాశివరాత్రి జాతర గోడప్రతులను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు శనివారం తాటిపెల్లి గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరను శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. నదిలో స్నానాలు ఆచరించేటప్పుడు పిల్లలను వదిలిపెట్టకుండా చూసుకోవాలన్నారు. ఆలయ కమిటి అధ్యక్షుడు ఎలుములె దత్తు భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రోహిణి ఆనంద్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీరో బిల్లు అందజేసిన వైస్ ఎంపీపీ



నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మెనీఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో గృహలక్ష్మి స్కీం క్రింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రవేశపెట్టడం హర్షనీయమని వైస్ ఎంపీపీ ఈర్త సత్యనారాయణ అన్నారు. శనివారం వేంపల్లి గ్రామంలో ఆయన విద్యుత్ శాఖ ఏఈ ఇర్ఫాన్‌తో కలిసి జీరో బిల్లులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయడం హర్షించదగ్గ విషయమని, ఈ పథకం ద్వారా ప్రతి పేదవారికి జీరో విద్యుత్ బిల్లు వల్ల ప్రతి ఒక్కరికి లాభం చేకూర్చే విధంగా ఉందని, కాంగ్రెస్ పేదల సంక్షేమం కోసం ఆలోచించి మరిన్ని పథకాలతో పాటు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీని ఏ ఒక్కటి కూడా నష్టపోకుండా అమలుచేయాలని, అప్పుడే కాంగ్రెస్ వాగ్దానాన్ని నిలబెట్టుకొనే విధంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు, ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి పుష్ప గుచం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పాటించాల్సిన విధి విధానాలపై చర్చించారు.

విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఈ నెల 4న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రధాన మంత్రి మోడీ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు జునుగరి మధూకర్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో విజయ సంకల్ప సభను విజయవంతం చేయడానికి మండలం నుండి పెద్దఎత్తున బీజేపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, బీజేపీ నాయకులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



విద్యార్థులకు సామాగ్రీ పంపిణీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం సమత సొసైటి ఆధ్వర్యంలో ఎగ్జామ్ పాడ్స్, పెన్నులు,స్కేల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమతా సొసైటీ అధ్యక్షులు దుర్గం జనార్ధన్, ప్రధాన కార్యదర్శి ముడిమాడుగుల తిరుపతి, ట్రెజరార్ దొంగ్రే గజానాన్, సొసైటీ సభ్యులు దుర్గం మోహన్, దొంగ్రే సంతోష్, జాడి సుకదేవ్, కొబ్రగడే రవి, దుర్గం రాంచందర్, రౌత్ శుభాకర్, దేవగడే సంతోష్, విలాస్, లింగయ్య, వార్డెన్ దర్శన్ దేవాజీ పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-బెజ్జూరు

మండలకేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు శనివారం పాలాభిషేకం చేశారు. ఇటీవల గృహలక్ష్మి పథకంలో భాగంగా గ్యాస్ సిలిండర్ రూ.500, ఉచిత కరెంటును అమలుచేయడంతో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసినట్టు వారు తెలిపారు. సంక్షేమ పథకాల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ముందుంటారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతారని ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, మండల అధ్యక్షుడు బూస శంకర్ అన్నారు. అనంతరం జీరో విద్యుత్ బిల్లులను లబ్ధిదారులకు అందజేశారు. అర్హులైన వారందరికి ఈ పథకాలు అందేలా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హనుమంతు, బాబాజీ, సుధాకర్ పాల్గొన్నారు.

పదోన్నతిపై వచ్చిన అధికారికి సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేసి పదోన్నతిపై శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓ టు జీఎం బాధ్యతలు చేపట్టిన పురుషోత్తంరెడ్డిని ఏరియా జీఎం శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేసి పదోన్నతి పై ఎస్ఓ టూ జీఎంగా రావడం సంతోషకరమైన విషయమని తెలిపారు. శ్రీరాంపూర్ ఉపరితల గని అన్ని విషయాలు పురుషోత్తమరెడ్డికి తెలిసి ఉంటాయని బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత పెంచడానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా ప్రెసిడెంట్ వెంకటేశ్వరరెడ్డి, ఏరియా ఇన్‌జనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, జియాలజిస్ట్ శ్రీనివాస్, పర్చేజ్ ఎస్ఈ చంద్రశేఖర్, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, ఎస్ఈ ఐఈడి కిరణ్ కుమార్, సీనియర్ పిఓ గౌస్ పాషా పాల్గొన్నారు.

దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో మాక్ పోలింగ్

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రమేష్ సమక్షంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిన ఓటింగ్‌లో పాల్గొని తమ తరగతి లీడర్లను ఎన్నుకున్నారు. సాధారణ ఎన్నికల విధానంగా ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయించి పోలింగ్ నిర్వహించి ఓటర్లుగా విద్యార్థులు తమ లీడర్లను ఎన్నుకున్నారు. మాక్ పోలింగ్ ద్వారా విద్యార్థి దశ నుంచే ఎన్నికలు, ప్రజా స్వామ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని హెచ్ఎం రాథోడ్ రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజత్ పాషా, లచ్చన్న, రాజేశం, రాజేష్, అనిత, మహేష్, కృష్ణ, రజిత పాల్గొన్నారు.

శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్
- ఘనంగా మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి

నవతెలంగాణ-నస్పూర్

ఉమ్మడి రాష్ట్రంలో మంథని నియోజకవర్గ శాసనసభ్యుడిగా, శాసనసభ అధిపతిగా రాష్ట్ర అభివృద్ధికి విశిష్ట సేవలు అందించిన దుద్దిళ్ళ శ్రీపాదరావు చిరస్మరణీయులని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్తో కలిసి పాల్గొని శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి మంథని నియోజకవర్గ శాసనసభ్యుడిగా, ఉమ్మడి రాష్ట్ర శాసనసభ అధిపతిగా వివిధ పదవులలో పని చేసి వినూత్న సంస్కరణలతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. రాజకీయ జీవితంలో యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని, దుద్దిళ్ళ శ్రీపాదరావు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ప్రజా సేవలో ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు 87వ జయంతి వేడుకలను శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీపాదరావు పల్లె ప్రాంతాలకు ప్రగతి ప్రదాత అని పేర్కొన్నారు. అనేక మారుమూల గ్రామాలకు విద్యుత్తును పరిచయం చేసిన మహానేత అని వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గుర్రం మంగా, మండల పరిషత్ అధ్యక్షులు, ఎస్ రాజేశ్వర్ ఎంపీడీఓ, బి బీరయ్య పాల్గొన్నారు.

రామకష్ణాపూర్ : శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను శనివారం క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్ మురళీ కృష్ణ, 7వ వార్డు కౌన్సిలర్ పోలం సత్యనారయణ, 10వ వార్డు కౌన్సిలర్ పనసా రాజయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్ : క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో నివాళ్లు అర్పిస్తున్న చైర్మన్ జంగం కళ

జైపూర్ : ఎస్టీపీపీలో మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతిని శనివారం అధికారికంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఏజీఎం రమణ, అధికారుల సంఘం అధ్యక్షులు సుముద్రాల శ్రీనివాస్ ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ సత్యనారాయణ రెడ్డి, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

భీమారం ఎంపీడీఓ కార్యాలంలో

భీమారం మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా శ్రీపాదరావు స్పీకర్‌గా శాసన సభ నిర్వాహణలో కీర్తించబడ్డారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ భుక్య తిరుమల, మండల పరిషత్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, ఎంపీఓ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : ఎంపీడీఓ కార్యాలయంలో స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు అన్నం మంగ, వైస్ఎంపీపీ, దేవేందర్‌రెడ్డి, అలాగే మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.సరోజా, మండల పంచాయతీ అధికారి, కె.విజయ్ ప్రసాద్, కార్యాలయ పర్యవేక్షకులు దేవేందర్‌రావు పాల్గొన్నారు.

కాసిపేట : ఉమ్మడి రాష్ట్రం స్పీకర్, ఎమ్మెల్యేగా దుద్దిల శ్రీపాదరావు చేసిన సేవలు గుర్తుగానే శ్రీపాద ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టారని తహసీల్దార్ బోజన్న అన్నారు. శనివారం మండలంలోని తమసీల్దార్ కార్యాలయంలో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మాణిక్ రావు, ఆర్ఐ సులోచన, శ్వేత, సర్వేయర్ చారి పాల్గొన్నారు.

నస్పూర్ : శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో దివంగత దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను జీఎ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీపాదరావు ఒక సామాన్య కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి మూడుసార్లు మంతని నియోజకవర్గ నుంచి గెలిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ నాయకులు ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా ప్రెసిడెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఓ టు జీఎం పురుషోత్తమరెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో

మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సురిమిళ్ళ వేణు, కమిషనర్ సతీష్ ఆధ్వర్యంలో శ్రీపాదరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చేయడం మహేష్, ఆర్ఓ సతీష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



జైపూర్‌లో..



కాసిపేటలో..



మందమర్రిలో..



నస్పూర్‌లో..

కాసిపేట-2వ గనిపై ఏఐటీయూసీ గేట్ మీటింగ్



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2వ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఫిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ హాజరై కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కాసిపేట-2 గనిలో కార్మికుల సమస్యలపై గతంలో అధికారుల దృష్టికి తీసుకుపోయిన సమస్యలు పరిష్కారాం కాలేదని, మరోసారి అధికారుల దృష్టికి తీసుకుపోవడం జరుగుతుందన్నారు. ఉద్యోగులకు మోటార్ సైకిల్ షెడ్డు నిర్మించాలని, గని నుండి మెయిన్ రోడ్డు వరకు లైట్లు ఏర్పాటు చేయాలని, క్వార్టర్ లేని కార్మికులకు ఇంటికి రాయితీ చెల్లించాలని ఎలక్ట్రిషన్, పిట్టర్స్ హెల్పర్‌ను ఇవ్వాలన్నారు. ఇటీవల కార్మికుల సెల్ ఫోన్లు పర్సులు ఎత్తుకు పోయే దొంగలు ఎక్కువ అయినారు కాబట్టి ప్రతి ఒక్క కార్మికునికి లాకర్ ఇవ్వాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలన్నారు. అనంతరం సమస్యలను వెంటనే అమలు చేయాలని గని మేనేజర్ లక్ష్మీ నారాయణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఆఫీస్ బేరర్ సుభాష్ చంద్రబోస్, ఫిట్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి నర్సయ్య, తీర్థాల చంద్రయ్య, నీలయ్య, రామ్ కొమురయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రూ.6 లక్షలతో తాగునీటి వసతి

- ఎంపీపీ గోదరి రమాదేవి లక్ష్మణ్



నవతెలంగాణ-జైపూర్

ముదిగుంట రసూల్ పల్లిలో ఆరు లక్షలతో తాగునీటి వసతి కల్పించడం జరిగిందని స్థానిక ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్ తెలిపారు. ఎంపీ లాడ్స్ నిధులు రూ.2 లక్షలతో శనివారం రసూల్ పల్లి ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ వద్ద హ్యాండ్ బోర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ముదిగుంట గ్రామపంచాయతీ పరిధిలోని బోడగూడెం, ఆరెవాడలలో రూ.4 లక్షలతో రెండు హ్యాండ్ బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీలను గుర్తించి స్థానికుల సౌకర్యార్థం హ్యాండ్ బోర్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అంజన్న గౌడ్, లక్ష్మణ్, శ్రీశైలం పాల్గొన్నారు.

తాండూరు సీఐగా కుమారస్వామి

నవతెలంగాణ-తాండూర్

తాండూర్ సీఐగా కుమారస్వామి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరావు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కుమారస్వామి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం హనుమకొండ కొత్తగూడెం వన్ టౌన్‌లలో పనిచేసిన కుమారస్వామికి జిల్లాలోని మంచిర్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పనిచేసిన అనుభవం ఉంది. తాండూర్ సర్కిల్ పరిధిలోని నెన్నలా కన్నెపల్లి భీమిని తాండూర్ మాదారం పోలీస్‌స్టేషన్ల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సీఐ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల ఆదేశాల మేరకు రాబోయే ఎన్నికల నిర్వహణకు పగడ్బందీ చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

5 స్టార్ రేటింగ్‌లో ఆర్కే-1ఏ గని

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

2019-2020 సంవత్సర ఆల్ ఇండియా కోల్ మైన్స్ 5 స్టార్ రేటింగ్‌లో ఆర్కే-1ఏ గని ఎంపికయింది. ఈ సందర్భంగా 5 స్టార్ రేటింగ్ రావడానికి కష్టపడ్డ గని కార్మిక, ఉద్యోగులకు జ్ఞాపికలను శనివారం ఆ గని ఏజెంట్ గోవిందరావు గని మేనేజర్ బి జయంత్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కే-1ఏ గని ఫిట్ సెక్రటరీ సురమళ్ళ వినయ్ కుమార్, హెడ్ ఓవర్మెన్ నెల్లి సదయ్య, సీనియర్ అసిస్టెంట్ విక్రమ్, కార్యాలయ సిబ్బంది సహృదయ్, తరుణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-తాండూర్

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జే.ముఖేష్ అన్నారు. శనివారం రాష్ట్ర సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో శనివారం భీమిని మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకులో మాట్లాడారు. విద్యార్థుల బాలిక సంరక్షణ చట్టాలు, మహిళా చట్టాలపై ప్రతి ఒక్క విద్యార్థికి అవగాహన ఉండాలన్నారు. సమస్య ఎదు రైనప్పుడు 100 డయల్ చేయాలన్నారు. విద్యార్థులు ఎలాంటి సమస్య ఉన్న మండల్ లీగల్ కౌన్సిలింగ్ అథారిటీకి బెల్లంపల్లి కోర్టుకి పోస్ట్ కార్డు ద్వారా ఫిర్యాదు చేసినట్లయితే వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. చిన్ననాటి నుంచి విద్యార్థులు క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థి దశలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థి దశలో మొబైల్ ఫోన్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. పాఠశాలలో సమస్యలు ఏమైనా ఉంటే తెలుపాల్సిందిగా విద్యార్థులను కోరగా తాగునీటి సమస్య, కర్జిభింపుర్ నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్ప మనోహర్, సీనియర్ న్యాయవాదులు గోపి కిషన్ సింగ్ ఠాకూర్, దుద్దిల్ల అశోక్, తహసీల్దార్ బికర్ణ దాస్, ఎస్సై ప్రశాంత్, ఇన్‌చార్జి హెచ్ఎం సువర్ణ, న్యాయవాదులు శివ బాలకృష్ణ, రవికుమార్, సంగీత, శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

కార్యకర్తను పరామర్శించిన జాన్సన్ నాయక్

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త జక్కుల గోపాల్‌ను బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ శనివారం పరామర్శించారు. గోపాల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. తమను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-జన్నారం

ఎంపీడీఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్ భవనం మీదుగా రామాలయం వరకు రోడ్డు నిర్మించాలని శనివారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డికి అంబేద్కర్ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆ సంఘం జిల్లా నాయకులు ముల్కల ప్రభాకర్, నేతకాని సంఘం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్ మాట్లాడుతూ అంబేడ్కర్ భవనానికి వెళ్లడానికి రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. రోడ్డుపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ త్వరలో అధికారులను పంపించి, అక్కడి పరిస్థితులను ఆరా తీసి రోడ్డు నిర్మాణానికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దుర్గం అమత రావు జునుగురి మల్లయ్య, దూళ్లే వెంకటేష్, తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు..

మందమర్రి సీఐగా శశిధర్ బాధ్యతలు

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా శశిధర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. కొంతకాలం ఇక్కడ విధులు నిర్వర్తించిన మహేందర్‌రెడ్డి బదిలీపై జనగామ జిల్లాకు వెళ్లారు. ఈ నేపథ్యంలో మందమర్రి సీఐగా శశిధర్‌ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. శనివారం సర్కిల్ కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పని చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు.

గల్ఫ్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మురిమడుగు గల్ఫ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమర కొండ మల్లేష్, ఉపాధ్యక్షులుగా పూడూరి సతీష్, సిరికొండ వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా గొట్ల తిరుపతి యాదవ్, కార్యదర్శులుగా పల్లికొండ రాజు, ఏరుగట్ల శేఖర్ బైరి మహేష్, కోశాధికారిగా సిరికొండ లచ్చన్న, ఉపకోశాధికారులుగా, ఇంధన్‌పెల్లి జగన్, కచ్చు రాజలింగు, ప్రచార కార్యదర్శిగా జగుడాల సత్తన్న, క్యాషియర్ ఆకుల లాలయ్య ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మురిమడుగు గ్రామ గల్ఫ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిరి రాజు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-మందమర్రి

మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్ రాజేశ్వర్ శనివారం ప్రజా పాలన సేవా కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలనేదే ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మి, గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకోలేకపోయిన అర్హులైన వారితో పాటు, దరఖాస్తులలో సరైన వివరాలు నమోదు చేయని వారి కోసం ఈ ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యాలయం పనిదినాల్లో ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు సేవలరె వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-మందమర్రి

ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో జీఎంకు వినతిపత్రం ఇచ్చారు. మందమర్రిలో ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఏరియా జీఎం మనోహర్‌కు వినతి పత్రం ఇచ్చారు. గతంలో మహిళల కోసం మందమర్రి లోని సిమ్ టార్స్‌లో ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ తరగతులు నిర్వహించి సర్టిఫికెట్ ఇచ్చేవారని ప్రస్తుతం కూడా అదే విధంగా కొత్తగా చేరుతున్న అభ్యర్థులకు ట్రైనింగ్ ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉంటుందని అన్నారు. డ్యూటీ అనంతరం 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరిఖని 8 ఇంక్లైన్ నిమ్స్‌లో ఏర్పాటు చేసిన సెంటర్‌కు వెళ్లి రావడం కార్మికులకు ఇబ్బందిగా ఉందని కావున శ్రీరాంపూర్ బెల్లంపల్లి మందమర్రి ఏరియా కార్మికుల కోసం మందమర్రిలో సెంటర్‌ను ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉంటుందన్నారు. సీఐటీయూ చేసిన విజ్ఞప్తి మేరకు సర్దార్ ట్రైనింగ్ ఇస్తున్న యాజమాన్యం ఆ అభ్యర్థులకు సైతం ఈ సర్టిఫికెట్ ఎంతగానో ఉపయోగపడే అవకాశం ఉన్నందున ఆ దిశగా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు ఎస్ వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, కేకే-5 పిట్ సెక్రటరీ సంకె వెంకటేష్, బోయిన సందీప్, నాయకులు అల్వాల సంజీవ్, చైతన్యరెడ్డి, కలవల శ్రీనివాస్, దుర్గం రాంబాబు, మహేందర్ పాల్గొన్నారు.



నిండు జీవితానికి రెండు చుక్కలు

- జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు



నవతెలంగాణ-నస్పూర్

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలని, అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలు పోలియో బారిన పడకుండా ఉంటారని జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు అన్నారు. మార్చి 3వ తేదీ ఆదివారం పోలియో దినం సందర్భంగా శనివారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ జిల్లాలో 0నుండి 5 సంవత్సరాలోపు పిల్లలు 75,727 మంది ఉన్నారని, పల్స్ పోలియో కేంద్రాలు 459 ఉన్నాయన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు పల్స్ పోలియోకు సంబంధించిన ఐఈసీ, లాజిస్టిక్స్ పంపించడం జరిగిందని, ఉదయం 6 :50 గంటల నుంచి సాయంత్రం 6: 10 గంటల వరకు పోలియో కేంద్రాలు పనిచేస్తాయన్నారు. మార్చి 5వ తేదీన ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేసుకుని పిల్లలకు వేయడం జరుగుతుందన్నారు. విద్య, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, ఇతర అనుసంధాన కార్యాలయాల్లో కోఆర్డినేషన్ చేసుకొని అందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. ప్రయివేటు ఆస్పత్రులలో జననాలు, చిన్నపిల్లల ఆసుపత్రిలో వైద్యులు తప్పనిసరిగా వారి పరిధిలో ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని, ప్రతిసారి రెండు చుక్కలు పోలియోపై నిరంతరము విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అనిత, నీరజ, విజయ పూర్ణిమ, శివ ప్రతాప్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల నిర్వాహణకు సహకరించాలి

నవతెలంగాణ-నస్పూర్

రానున్న పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్‌లో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సహాయక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఒక పోలింగ్ కేంద్రంలో 1 వేయి 500 మంది ఓటర్లుగా ఉండే పరిమితి 1 వేయి 600 మందికి పెంచడం జరిగిందని తెలిపారు. జిల్లాకు సంబంధించి ఓటరు జాబితాలో 583 డూప్లికేట్ ఎపిక్ కార్డులను నిబంధనల మేరకు తొలగించడం జరిగిందని, జిల్లాలో ఓటరు నిష్పత్తి లింగ నిష్పత్తి సానుకూలంగా ఉందని, ఎన్నికల్ పోలింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఇటీవల జరిగిన శాసనసభ నియోజకవర్గ ఎన్నికల సందర్భంలో పంపిణీ చేయబడిన ఓటరు స్లిప్పులలో మిగిలిన వాటిపై విచారణ జరిపి ఎఎస్‌డీ ఆధారంగా ఓటరు జాబితా సవరించడం జరిగిందని, 18 సంవత్సల వయస్సు నిండిన వారికి నూతన ఓటు నమోదుకు భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
ఆదిలాబాద్
ఆదివారం | మార్చి 03, 2024 | www.navatelangana.com

జీరో బిల్లు అందించిన విద్యుత్ అధికారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



కాంగ్రెస్ గ్యారంటీలో ఒక్కటైన గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత కరెంట్ ప్రభుత్వం అందిస్తుంది. ఇందులో భాగంగానే శనివారం మావల మండల జెడ్పీటీసీ నల్ల వనితకుగృహ జ్యోతి కింద జీరో బిల్లును విద్యుత్ అధికారులు అందజేశారు, అదిలాబాద్ డివిజన్ మావల న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలో జీరో బిల్స్ అందించామని అధికారులు తెలిపారు. ఇందులో సెక్షన్ దేవేందర్, వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, డీఈ హరికృష్ణ ఆదిలాబాబాద్ ఏఈ జనార్దనరెడ్డి, మావల సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో ఆర్డీఓ పర్యటన

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో శనివారం డీఆర్డీఓ విజయలక్ష్మి పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం నర్సరీని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ ఒక్కరూ ఉపాధి హామీ చట్టాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించాలని అన్నారు. డీఆర్డీఓ వెంట ఏపీఓ ప్రమీల, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ జెడ్డి శ్రీనివాస్ ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

త్వరలో జరుగబోయే లోకసభ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని అధిక మెజారిటీతో గెలిపించి కాంగ్రెస్ సత్తా చాటాలని ఎంపీ టికెట్టు ఆశావాహురాలు ఆత్రం సుగుణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ నాయకులతో సమావేశంలో నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అధిష్టానం ఆశీస్సులతోనే నియోజకవర్గం పరిధిలో ఉన్న గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రజలందరిని కలుస్తూ వస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. కార్యకర్తలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కొరకు పూర్తి మద్దతుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వొద్నలా రాజేశ్వర్, ప్రభాకర్, లింగారెడ్డి, ఈటెల శ్రీనివాస్, నాగేష్, భీమన్న శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ సీటు సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకు ఇవ్వాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

బీజేపీ ఎంపీ సీటు సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకు ఇవ్వాలని తుడుం దెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ మాట్లాడుతూ బీజేపీలో ఉన్న కొంత మంది, సోయం బాపురావుకు బీ ఫామ్ రాకుండా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. సోయం బాపురావును కాదని ఎవరికైనా సీటు కేటాయిస్తే బీజేపీకి తగిన బుద్ధి చెప్పాల్సి ఉంటుందని కొడప నగేష్ హెచ్చరించారు. ఈ సమావేశంలో తుడుం దెబ్బ నాయకులు మెస్రం దేవురావు, మాడవి భీంరావు, మెస్రం ఆనంద్‌రావు, సిడాం మారుతి, ఆర్క జగదీశ్వర్ పాల్గొన్నారు.

విలీన మహాసభలకు బయలుదేరిన నాయకులు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఖమ్మంలో మూడు రోజుల పాటు జరిగే విప్లవ పార్టీల ఐక్యత మహాసభలకు మండలం నుంచి ప్రజాపంథా నాయకులు శనివారం బయలు దేరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.గంగన్న మాట్లాడుతూ భారత దేశంలోని దాదాపుగా 18 రాష్ట్రాల నుంచి మూడు విప్లవ పార్టీలు ఒకే వేదికగా ఒక్కటవబోతున్నాయని, మూడు పార్టీలు విలీనమై దేశ వ్యాప్తంగా ఒకే విప్లవ పార్టీగా సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ పేరుతో అవిర్భవించబోతుందని తెలిపారు. ఈ మూడు విప్లవ పార్టీల కలయిక భారత విప్లవోద్యమంలో ఒక మైలు రాయిగా భారత దేశ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. దేశంలో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్య, ఉద్యోగాలు, ఉపాధిని గాలికొదిలేసి, కేవలం బడా కార్పొరేట్ మతతత్వ శక్తులకు ఎర్ర తివాచీ పరుస్తుందని విమర్శించారు. ప్రస్తుతం దేశంలోని స్థితిగతులను బట్టి తమ నూతన పార్టీకి సరైన సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి బయలు దేరిన వారిలో ప్రగతిశీల మహిళా సంఘం పీఓ డబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.లక్ష్మి, పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

నవతెలంగాణ-పెంబి

మండలంలోని తాటిగూడ గ్రామంలో భూక్య సాన్వికపై విధి కుక్కలు దాడి చేసిన ఘటనలో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే స్పందించి, చికిత్స నిమిత్తం పెంబి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

2024-25 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వుల మేరకు హైదరాబాద్‌లోని బేగంపేట్, రామంతపూర్ పబ్లిక్ స్కూల్ (అంగ్ల మాధ్యమం)లో 1వ తరగతిలో ప్రవేశం కొరకు నిరుపేద గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి గంగారాం ఒక ప్రకటనలో తెలిపారు. గోండు, నాయక్పోడ్(02), కొలాం-పీటీజీ(01), కోయ(01), సుగాలీ, లంబాడా (01) ఇతర గిరిజనులకు (01)మొత్తం 6 సీట్ల ద్వారా ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలను లక్కీ డ్రా పద్ధతిన ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలకు మించి ఉండరాదని, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆధాయ ధ్రువీకరణ పత్రం మీ-సేవ ద్వారా జారీ చేయబడి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు జూన్ 1, 2017 నుంచి మే 31, 2018 మధ్య జన్మించి ఉండాలని, జనన ధ్రువీకరణ పత్రం మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్ బోర్డు తహసీల్దారేచే జారీ చేయబడి ఉండాలని, పూర్తి చేసిన దరఖాస్తులను ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు పాస్పోర్ట్ సైజ్ ఫొటోలు 2 సెట్లు గెజిటెడ్ అధికారి సంతకంతో ఈ నెల 11వ తేదీ సాయంం 5 గంటలలోగా జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మాజీ స్పీకర్ శ్రీపాదరావ్ జయంతి వేడుకలు



ఆదిలాబాద్ రూరల్..



రెబ్బెన..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసన సభ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పి సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పాల్గొని శ్రీపాద రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రమేష్ రాథోడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు

సిరికొండ : స్వర్గీయ మాజీ స్పీకర్ శ్రీపాదరావ్ జయంతి వేడుకలు శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, సిబ్బంది ఉమాదేవి, అమూల్, రాజేశ్వర్, దేవిదాస్ పాల్గొన్నారు.

జైనథ్ : మండలకేంద్రంలోని మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో శనివారం దుద్దిల్ల. శ్రీపాద రావు(ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ శాసన సభ స్పీకర్) జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ ప్రస్థానంలో గ్రామ సర్పంచ్ నుండి స్పీకర్‌గా ఎదిగారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కోడిచర్ల సుదర్శన్, మండల పరిషత్తు అభివృద్ధి అధికారి ఎ. రవీంద్రనాథ్, కార్యాలయ పర్యవేక్షకులు జి. ముత్యం రావు, ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, దిలీప్, వేంకటరెడ్డి(ఖాప్రి) పాల్గొన్నారు.

ఉట్నూర్ : మాజీ శాసనసభాపతి దుద్దిల శ్రీపాదరావు 87వ జయంతి వేడుకలను శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దుద్దిల శ్రీపాదరావు చిత్రపటానికి పూలు మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్రా జైవంత్ రావు, ఎంపీ ఓ.లింగయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఆదిలాబాద్ రూరల్ మండల్ ప్రజాపరిషత్ అభివద్ధి అధికారి కార్యాలయంలో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీంసారి ఎంపీటీసీ బిక్కి గంగాధర్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా మంథని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసనసభ్యులుగా ఎన్నికై ఉమ్మడి రాష్ట్రానికి స్పీకర్‌గా పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి : ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ శాసన సభపతి దుద్దిళ్ళ శ్రీపాద రావు 87వ జయంతిని శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బందితో పాటు ఎంపీపీ మంజుల శ్రీధర్ రెడ్డి పాల్గొని అయన చిత్రా పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభపతిగా ఉంటూ రాజకీయాలకు అతీతంగా చేసిన ప్రజా సేవలను కొనియాడారు. యువత కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్ రెడ్డి, సూపరింటెండెంట్ రవీందర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

రెబ్బెన : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయ ఆవరణలో శనివారం అసెంబ్లీ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను సింగరేణి యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ మచ్చగిరి నరేందర్ శ్రీపాదరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా యువత కోసం ఆయన చేపట్టిన కార్యక్రమాలను స్మరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఏజీఎం తిరుమలరావు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహారా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.



సిరికొండ



తాంసి

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



రెబ్బెనలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-జైనూర్

ఆసిఫాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు జన్మదిన వేడుకలను శనివారం జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలకేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, సిర్పూర్(యు) మడల అధ్యక్షుడు ధర్మారావు, లింగాపూర్ మండల అధ్యక్షుడు ఆత్రం అనిల్, మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రెబ్బెన : ప్రజాసేవే తన ఊపిరిగా అభివృద్ధి బాటలో అలుపెరగని నాయకుడు, ఆదివాసీ ముద్దుబిడ్డ, జన హృదయ నేత ఆసిఫాబాద్ మాజీ శాసనసభ్యుడు ఆత్రం సక్కు జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణీలు, రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్డు ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవీ, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు మాన్యం పద్మ, మహిళా మండలి అధక్షురాలు అరుణ, మురీలగౌడ్, కుందారపు శంకరమ్మ, నంబాల మాజీ ఎంపీటీసీ కొవ్వూరి శ్రీనివాస్, దుర్గం రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల జాప్యంపై ఆందోళన



నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని రాంపూర్ గ్రామానికి బీటీ రోడ్డు నిధులు మంజూరై సంవత్సరం గడుస్తున్నా రోడ్డు నిర్మించడంలో జాప్యం నిరసిస్తూ మండలంలోని గ్రామస్తులతో కలిసి డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాప్లె పురుషోత్తం రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంపూర్ గ్రామానికి 20 సంవత్సరాలు గడుస్తున్నా ఎన్ని ప్రభుత్వాలు మారిన గ్రామానికి బీటీ రోడ్డు లేని పరిస్థితి ఉందన్నారు. గత సంవత్సరంలో రూ.1.40 కోట్లు విడుదలైనప్పటికీ పనుల్లో జాప్యం జరగడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నిరసన తెలుపుతున్న సంఘటన స్థలానికి సిర్పూర్ ఎస్ఐ దీకొండ రమేష్ వచ్చి కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి పనుల జాప్యంపై కాంట్రాక్టర్ సమాధానం చెపుతూ బీటీ రోడ్డు పనులు ప్రారంభించిందని నిజమే కానీ రెబ్బెన జెడ్పీటీసీ ఫోన్ చేసి ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టిన తర్వాతనే బీటీ రోడ్డు పనులను ప్రారంభించాలని అనడంతో ఆపి వేయడం జరిగిందన్నారు. రోడ్డు పనులు ఆపడానికి గల కారణం జెడ్పీటీసీనే అని తెలుసుకున్న గ్రామస్తులు జెడ్పీటీసీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందిపడుతున్న విషయం తెలిసిన కానీ కొబ్బరికాయ కొట్టడం ముఖ్యమనే ఆలోచన సరికాదని వారన్నారు. దీనిని రాజకీయం చేయడం తగదన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే రోడ్డు పనులను ప్రారంభించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున గ్రామస్తులు, డీవైఎఫ్ఐ నాయకులతో కలిసి జెడ్పీటీసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు చల్లూరి వంశీ, చాపిడి శివ, కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఏరియాలో 107 శాతం బొగ్గు ఉత్పత్తి

నవతెలంగాణ-నస్పూర్


శ్రీరాంపూర్ ఏరియాలో ఫిబ్రవరి నెలలో బొగ్గు ఉత్పత్తి 107శాతం సాధించినట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శనివారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో నిర్దేశించిన 5,25,000 టన్నుల ఉత్పత్తిగాను 5,62,061 టన్నుల ఉత్పత్తి సాధించి 107 శాతం సాధించిందన్నారు. అలాగే వార్షిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటామన్నారు. అత్యధికంగా భూగర్భ గనులలో ఆర్కే-6 గని 109 శాతంతో ముందుందని తెలిపారు. ఫిబ్రవరి నెలలో కారుణ్య నియమకల కింద శ్రీరాంపూర్ ఏరియాలో 85 మందికి హైదరాబాదులో నియామక పత్రాలు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేసినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు చేంజ్ ఆఫ్ క్వార్టర్ అవకాశం కల్పించినట్లు, ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్విని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం పురుషోత్తమ రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవిలు, పర్సనల్ మేనేజర్ దేవేందర్ పాల్గొన్నారు.



'ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం'

నవతెలంగాణ-జన్నారం

ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అన్నారు. శనివారం మండలంలోని ఇంధన్ పల్లి గ్రామ సమీపంలో ఉన్న, హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన భూక్య సంతోష్ నాయక్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోలిచందు, జిల్లా నాయకులు గుండవరపు మధుసూదన్ రావు, మండల ప్రధాన కార్యదర్శి వంగపల్లి సురేష్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు కడ అనిల్, విద్యాసాగర్, కృష్ణ, భరత్ నాయక్ పాల్గొన్నారు.



భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో గల పర్వతాల మల్లన్న ఆలయంలో శనివారం ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠతో పాటు, నవగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్టా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు దుద్దిల్ల మనోహర్ అవదాని, ధీరజ్ శర్మ పర్యవేక్షణలో గ్రామ పంచాయతీ యువజన సంఘం నాయకులతో కలిసి గ్రామస్తులు భక్తులు విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేలాల గట్టు మల్లన్నను దర్శించుకోవడం కోసం లక్షలాదిగా తరలివచ్చే భక్తులు ముందుగా కిష్టాపూర్ గ్రామంలో గల పర్వతాల మల్లన్నను దర్శించుకోవడం ఆనవాయితీగా పాటిస్తారు. పర్వతాల మల్లన్న దర్శనార్థం తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం యువజన సంఘం ఆధ్వర్యంలో ఇప్పటి నుండి ఏర్పాట్లు చేస్తున్నారు.

పాఠశాలకు సామాగ్రి అందజేత



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని శిశు మందిర్ పాఠశాలకు యాభై వేల రూపాయల సామాగ్రిని హిందూ ఉత్సవ కమిటీ మండల అద్యక్షుడు న్యానోబా పుష్కర్ అందజేశారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో సిబ్బందికి బీరువాతో పాటు పలు సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశు మందిరాలు ప్రగతికి నిలయాలని సంస్కృతితో పాటు కూడిన విద్యను అందిస్తోందని అన్నారు. సామగ్రి పంపిణీ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రూపవతి పుష్కర్, నాయకులు రాథోడ్ ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు మీలింద్ ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.